# రైతులకు అందని వ్యవసాయం

- కూటమి ప్రభుత్వంలో రైతులకు దక్కని సాయం
- రైతు భరోసాను అన్నదాత సుఖీభవగా పేరు మార్పు
- ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని చంద్రబాబు ప్రచారం
- అదిగో, ఇదిగో అంటూ కాలయాపన
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏటా అందిన రైతు భరోసా
- నేడు సార్వా సాగుకు చిల్లిగవ్వ లేక అప్పుల కోసం అన్నదాతల పాట్లు


సార్వా సాగుకు సిద్ధం చేస్తున్న వరి చేలు

**యలమంచిలి:** సార్వా సాగుకు సన్నద్ధమవుతున్న రైతులకు పెట్టుబడి సాయం అందక అప్పులపాలవుతున్నారు. దాళ్వా ధాన్యం సొమ్ములు బ్యాంకు ఖాతాలో జమ కాక ఒక వైపు, ప్రభుత్వం అందిస్తానన్న సాయం అందక మరో వైపు రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూటమి నాయకుల మాటలకు చేతలకు పొంతన ఉండటం లేదు. సార్వా సాగు మొదలు కాక ముందే ఐదేళ్ల పాటు పంటల సాగు కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేయడంతో వ్యవసాయం పండుగలా సాగింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా, ఇప్పటి వరకు కనీసం సాయం చేయకపోవడంతో ప్రస్తుతం పంటల సాగుకు చేతిలో నగదు లేక అన్నదాతలు అష్టకష్టాలు పడుతున్నారు. అధికారమే పరమావధిగా అలవిగాని హామీలిచ్చి ప్రస్తుతం వాటిని అమలు చేయలేక ఫీట్లు వేస్తున్నారు. ముందస్తుగా కురిసిన వానలకు రైతులు సార్వా ముందస్తు సాగుకు పూనుకున్నారు. మండలంలో ఈ సార్వా సీజన్‌లో సుమారు ఎనిమిది వేల ఎకరాల్లో వరి సాగవుతుందని వ్యవసాయాధికారులు ప్రాథమిక అంచనా వేశారు. అయితే వర్షాలు ముందుగా కురిసిన కాలువ నీరు ఆలస్యంగా రావడంతో రైతులు ఇప్పుడిప్పుడే సార్వా ఆకుమడులు వేయడానికి సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో పెట్టుబడులకు డబ్బులు లేకపోవడంతో వడ్డీ వ్యాపారులను ఆశ్రయించవలసిన దుస్థితి ఏర్పడింది.

**పేరు మార్పుతో సరి**

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అన్నదాతలను ఆదుకునేందుకు రైతు భరోసా పథకం కింద ఏటా ఆర్థిక సాయం అందేది. కూటమి ప్రభుత్వం వచ్చాక రైతు భరోసాను అన్నదాత సుఖీభవగా పేరు మార్చినప్పటికీ ఏడాది గడిచినా సాయం సంగతి మరిచారు. నాడు ఏటా రైతులకు రూ.13,500 అందేవి. కూటమి పెద్దలు మాత్రం రూ.20 వేలు అందజేస్తామని ప్రకటించి చేతులు దులుపుకున్నారు. అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచినా పథకం అమలు ఊసే లేదు.

**అదిగో.. ఇదిగో అంటూ కాలయాపన**

పేరు మార్చిన అన్నదాత సుఖీభవ పథకం అమలులో ప్రభుత్వంలో స్పష్టత కొరవడింది. ఏడాది నుంచి ఇస్తామని చెబుతున్నా నేటి వరకు విధి విధానాలు వెల్లడించకపోవడాన్ని చూస్తే పాలకుల చిత్తశుద్ధి ఏపాటిదో అర్థమవుతోంది. ఈ నెల 20వ తేదీన అని ఒకరు, కాదు.. కాదు 21వ తేదీన అని సీఎం చంద్రబాబు నాయుడు పలుమార్లు ప్రకటించినప్పటికీ 25వ తేదీ గడిచినా రైతుల ఖాతాలో పథకం సొమ్ము జమ కాలేదు. ఇప్పటికీ అమలు చేసే ఉద్దేశ్యం ఉందా లేదా అని రైతులు ప్రశ్నిస్తున్నారు. గతేడాది దిగుబడులకు మద్దతు ధర లభించకపోవడం, అంతంత మాత్రంగానే పంటలు రావడంతోపాటు మే నెల తరువాత ధాన్యం అమ్మిన రైతులకు ఇంత వరకు డబ్బులు జమ కాకపోవడంతో కర్షకుల చేతిలో చిల్లగవ్వ లేక పంటల సాగుకు అప్పులు చేయాల్సి వస్తోంది.

**కౌలు రైతులకు దక్కని భరోసా**

భూమిలేని రైతులు కౌలుకు భూములను సాగు చేస్తున్న వారికి కూడా వైఎస్సార్ రైతు భరోసా కింద పెట్టుబడి సాయాన్ని వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అందించింది. అయితే నేడు అవేవీ అమలు చేయకుండా రద్దు చేయడంతో కౌలు రైతులు పథకాలన్నింటికీ దూరమై గగ్గోలు పెడుతున్నారు.

### అప్పు చేసి నారుమడులు వేయాలి



అధికారంలోకి రావాలన్న తపనతో కూటమి నాయకులు అమలుకు సాధ్యం కాని హామీలు గుప్పించారు. పాలనా పగ్గాలు చేపట్టిన తరువాత రైతు భరోసా పథకాన్ని అన్నదాత సుఖీభవగా పేరు మార్చారు. ఏడాది గడిచినా రైతులకు కనీస సాయం కొరవడింది. సంవత్సరానికి రూ.20 వేలు సాయం చేస్తామని చెప్పి అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారే తప్ప పథకం అమలులో స్పష్టత కొరవడింది. సార్వా పంట సాగుకు సొమ్ములు లేవు. అప్పులు చేసి నారుమడులు వేయవలసిన దుస్థితి ఏర్పడింది.

–అడబాల రామ్మోహనరావు, మేడపాడు

### గత ప్రభుత్వంలో క్రమం తప్పకుండా రైతు భరోసా



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్నదాతలకు భూసార పరీక్షల నుంచి దిగుబడుల వరకు రైతులకు అండగా ఉంది. పంట దిగుబడి వచ్చిన తరువాత మద్దతు ధరకు కొనుగోలు చేసే వరకు అండగా నిలబడేది. ప్రకృతి వైపరీత్యాలు వచ్చి పంటలు నష్టపోతే రైతులకు ఏ సీజన్‌కు సంబంధించి ఆ సీజల్‌లోనే పరిహారం అందజేసేది. అలాగే సార్వా ప్రారంభానికి ముందే రైతు భరోసా పథకం కింద ఏడాది రూ.13,500 నగదు సాయం రైతుల ఖాతాలో జమ చేసింది. ఈ ప్రభుత్వం సాయం అందించకపోవడమే కాకుండా ఇంత వరకు దాళ్వా ధాన్యం అమ్మిన సొమ్ములు రైతులకు జమ చేయలేదు.

–బొంతు వెంకట కర్నారెడ్డి, రైతు, చింతదిబ్బ

## క్లుప్తంగా

### మున్సిపల్ అధికారుల బాధ్యతల స్వీకరణ


ఆర్‌ఐ కృష్ణమోహనరావు


టీపీవో రమణ

**నరసాపురం:** నరసాపురం మున్సిపాలిటీలో ఇద్దరు అధికారులు బుధవారం బాధ్యతలు చేపట్టారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న ఎ.నానాజీ పాలకొల్లు బదిలీ కాగా ఆయన స్థానంలో భీమవరంలో ఆర్‌ఐగా పని చేస్తున్న ఎస్.కృష్ణ మోహనరావు బాధ్యతలు చేపట్టారు. టీపీవోగా పని చేస్తున్న త్రినాథరావు పాలకొల్లు మున్సిపాలిటీకి బదిలీకాగా ఆయన స్థానంలో కాకినాడ కార్పొరేషన్‌లో పని చేస్తున్న ఎంవీ రమణ బదిలీపై ఇక్కడి బాధ్యతలు తీసుకున్నారు. వారిని ఆయా సెక్షన్ల సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

### పాఠశాలలకు విద్యా సామగ్రి అందజేత


విద్యా సామగ్రి అందుకుంటున్న ఉపాధ్యాయులు

**పాలకొల్లు సెంట్రల్:** పట్టణ పరిధిలో బీఆర్ఎంవీ ఉన్నత పాఠశాల క్లస్టర్ పరిధిలోని పది ప్రైమరీ పాఠశాలల్లో విద్యార్థులకు విద్యా సామగ్రిని అందజేశారు. బుధవారం బీఆర్ఎంవీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీ లక్ష్మీభాయి సౌజన్యంతో విద్యార్థులకు పెన్సిళ్లు, పెన్నులు, స్కేళ్లు, చాక్‌మార్, ఎరేజర్లు అందజేశారు. విద్యా సామగ్రిని ఆయా పాఠశాలల అధ్యాపకులు అందుకున్నారు. కార్యక్రమంలో క్లస్టర్ సెక్రటరీ రాయపూడి భవానీ ప్రసాద్, రాజ్‌కుమార్, రాము, పలువురు ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

### అనుమానాలు రేకెత్తిస్తున్న మస్తర్లు

**పెనుగొండ:** మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా ఉపాధి కూలీలకు ములపర్రులో రాత్రి వేళ మస్తర్లు వేయడం అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. సాధారణంగా ఉపాధి కూలీలకు ఉదయం, సాయంత్రం మస్తర్లు వేస్తారు. అయితే దీనికి భిన్నంగా ములపర్రులో రాత్రి వేళ మస్తర్లు వేస్తున్నారు. దీనిలో మర్మం బోధ పడడం లేదంటూ పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. తప్పుడు మస్తర్లు వేస్తున్నారంటూ పలువురు ఆరోపిస్తున్నారు. దీనిపై మండలాధికారులకు సమాచారం అందించినా చలనం లేదని విమర్శించారు. దొంగ మస్తర్లు వేయడంపై నిగ్గు తేల్చాలని పలువురు డిమాండ్ చేశారు.

### దేవ విద్యార్థినికి ఆలిండియా ర్యాంకు


విద్యార్థిని రూపా నాగదుర్గ

**పెనుగొండ:** జాతీయ స్థాయిలో నిర్వహించే ఎన్‌టీఏ శ్రేష్ఠ పరీక్షల్లో పెనుగొండ మండలం దేవలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని బూలా రూపా నాగదుర్గ ఆలిండియా 816వ ర్యాంకు సాధించిందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.సత్య ప్రియరామ్ తెలిపారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ అదే విధంగా ఎన్ఎంఎంఎస్ పరీక్షలకు ఎంపికైందని వివరించారు. నలుగురు విద్యార్థులు కె.దానేశ్వరి, బి.రూపా నాగదుర్గ, పి.యువవర్షిత, ఎం.హేమహేశ్వరి ఎంపికయ్యారన్నారు. విద్యార్థులను సర్పంచ్ నల్లూరి సత్యనారాయణ, పీఎంసీ చైర్మన్, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు అభినందించారన్నారు.

### ప్రజా సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

**భీమవరం(ప్రకాశం చౌక్):** పీజీఆర్ఎస్ వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మండల సర్వేలను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ జాయింట్ కలెక్టర్ ఛాంబర్ లో పీసీఆర్ఎస్‌లో వచ్చిన దరఖాస్తులు పెండింగ్, జాయింట్ ఎల్ పి ఎం ఎస్ సంబంధించిన పురోగతిపై బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా సర్వే అధికారి, డివిజన్ మండల సర్వేలతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా శ్రద్ధ పెట్టి పనిచేయాలని సర్వే అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా సర్వే ఇన్‌చార్జి అధికారి కె.శ్రీనివాసరావు, డివిజన్ సర్వే అధికారులు జి.మల్లికార్జునరావు, కె.నాగభూషణం, కె.కరుణకుమార్ పాల్గొన్నారు.

### అక్రమ మద్యం స్వాధీనం

**ఆకివీడు:** స్థానిక పాత బస్టాండ్ సమీపంలో అక్రమ మద్యం ( ఎన్డిపిఎల్ )విక్రయిస్తున్న వ్యక్తిని బుధవారం సాయంత్రం అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు చెప్పారు. స్థానికంగా నివసిస్తున్న సత్యనారాయణ అనే వ్యక్తి వద్ద 13 అక్రమ మద్యం బాటిల్ (750ఎంఎల్) స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. దాడుల్లో ఎక్సైజ్ సీఐ చక్రవర్తి, ఎస్సై కరుణ ప్రియా ప్రియా సిబ్బంది పాల్గొన్నారు.

## 5న లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి


పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి

**నరసాపురం:** వచ్చే నెల 5వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని నరసాపురం సీనియర్ సివిల్ జడ్జి జి.గంగరాజు సూచించారు. లోక్ అదాలత్ నిర్వహణపై బుధవారం కోర్టు హాల్‌లో పోలీసు అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కక్షిదారులు ఇరుపక్షాలకు నోటీసులు ఇచ్చి కౌన్సెలింగ్ నిర్వహించడం ద్వారా వారిలో అవగాహన పెంచొచ్చని చెప్పారు. రాజీ చేసుకోదగ్గ కేసులు పరిష్కరించుకునే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. రాజీమార్గం రాజమార్గమని కక్షిదారులు గుర్తించేలా చూడాలన్నారు. లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడం ద్వారా సమయం, డబ్బు ఆదా అవుతాయని చెప్పారు. ఈ సమీక్షలో జూనియర్ సివిల్ జడ్జి ఆర్.వరలక్ష్మి, నరసాపురం, మొగల్తూరు, యలమంచిలి మండలాల పోలీసు అధికారులు, కోర్టు లైజన్ అధికారి భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

## శక్తి యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ రజనీ కుమార్

**పాలకొల్లు సెంట్రల్:** ఆడ పిల్లలు విద్యార్థి దశ నుంచి తమకున్న చట్టాలపై అవగాహన కల్పించుకోవాలని పట్టణ సీఐ కోలా రజనీకుమార్ అన్నారు. బుధవారం స్థానిక సుభాష్ చంద్రబోస్ ఉన్నత పాఠశాలలో మహిళా చట్టాలపై అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ రజనీకుమార్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి చట్టాలపై అవగాహన కల్పించుకుంటే ఎటువంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొగలిగే సత్తా కలిగి ఉంటారన్నారు. శక్తి మొబైల్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బాలికలు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను ఎదుర్కోవడానికి శక్తి యాప్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఏదైనా సమస్య ఉంటే భయపడకుండా తల్లిదండ్రులతో కలిసి ధైర్యంగా ముందుకొచ్చి పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సైబర్ నేరాలపై అత్యంత అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై పృథ్వీ, ఏఎస్సై మార్‌లింగం, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## ఫౌండేషన్ల సేవలు అభినందనీయం


రక్తదాన శిబిరం ప్రారంభించిన ఆర్‌డీవో దాసి రాజు

**పాలకొల్లు సెంట్రల్:** పది మందికి సేవ చేయడం కూడా ఓ వరమేనని నరసాపురం ఆర్డీవో దాసి రాజు అన్నారు. బుధవారం స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాలులో పోట్నూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పలు సేవా కార్యక్రమాలను ప్రారంభించి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా దాసి రాజు మాట్లాడుతూ ఇటీవల ప్రారంభించిన ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ ఎంతో మందిని ఆదుకుంటున్నారన్నారు. ఇటువంటి ఫౌండేషన్ల సేవలు అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా రక్తదానం, ఐదుగురికి తోపుడు బళ్లు, బ్రాహ్మణులకు దుస్తులు, నగదు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ యడ్ల దుర్గా కిషోర్, అంగర రామ్మోహన్, కోడి విజయ భాస్కర్, ఫౌండేషన్ నిర్వాహకులు పోట్నూరి అప్పన్న, దుర్గా భవానీ, పెచ్చెట్టి బాబు, జీవీ, కర్నేని గౌరునాయుడు, రోజారమణి, మహ్మద్ జానీ, దనాని సూర్యప్రకాష్, బోణం చినబాబు, తులా రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## కొఠారి కమిషన్ సిఫార్సులు అమలు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఏఐఎస్ఏ జిల్లా కార్యదర్శి అప్పలస్వామి

**యలమంచిలి:** ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడాలంటే కొఠారి కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏనుగువానిలంక గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఏఐఎస్ఏ ఆధ్వర్యంలో గత విద్యా సంవత్సరంలో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు తరగతుల వారీగా నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగం రక్షణకు కొఠారి కమిషన్ చెప్పినట్లు బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించాలన్నారు. ప్రభుత్వం విద్యకు అరకొర నిధులు కేటాయించడం వలన ప్రభుత్వ విద్య పూర్తిగా నిర్వీర్యం అయ్యే పరిస్థితి వచ్చిందన్నారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం అవధాని, ఏఐఎస్ఏ పాలకొల్లు నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు పుల్లూరి రాంప్రసాద్, మెడవాల రాజా నాయకులు ఆర్.మణిదీప్, పి.శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

## బాలా త్రిపుర సుందరీదేవికి విశేష పూజలు

**భీమవరం(ప్రకాశం చౌక్):** పట్టణంలోని భీమవరం మెంటేవారితోటలోని బాలా త్రిపుర సుందరీ అమ్మవారికి 25 కేజీల మల్లెపూలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అభివృద్ధి కమిటీ పర్యవేక్షణలో ఆలయ అర్చకులు కొమ్ము శ్రీనివాస్ అధ్వర్యంలో పట్టణానికి చెందిన మద్దాల వెంకట సతీష్ దంపతులు, కోత్తూరి వెంకటేశ్వర్రావు, శివరంజని దంపతులచే కుంకుమ పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. మద్దాల సత్యనారాయణ దంపతులచే 25 కేజీల మల్లెపూలతో ప్రత్యేక అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# రోడ్డెక్కిన కౌలు రైతులు


ధాన్యం డబ్బులు చెల్లించాలని ఆందోళన చేస్తున్న కౌలు రైతులు

**పెనుమంట్ర:** ధాన్యం డబ్బులు వెంటనే చెల్లించాలని ఏపీ కౌలు రైతుల సంఘం డిమాండ్ చేసింది. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసి నెలల తరబడి ధాన్యం డబ్బులు రాకపోవడంతో కౌలు రైతులకు పంట నుంచి వచ్చే ప్రతిఫలం కనీసం తెచ్చిన అప్పుల వడ్డీలకు కూడా సరిపోవడం లేదని ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా కమిటీ సమావేశం మార్టేరులోని రోటరీ క్లబ్‌లో కూసంపూడి సుబ్బరాజు అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం ధాన్యం డబ్బులు ఇవ్వాలని పంచాయతీ సెంటర్ వద్ద కౌలు రైతులు, జిల్లా కమిటీ సభ్యులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ ధాన్యం అమ్మి రెండు నెలలవుతున్నా రైతులకు డబ్బులు ఇవ్వకపోవడం దారుణమన్నారు. జిల్లాలో దాదాపు మూడు వేల మంది కౌలు రైతులకు రూ.250 కోట్ల వరకు రావాలని తెలిపారు. ప్రభుత్వం ధాన్యం డబ్బులు వెంటనే ఇవ్వకపోతే ఆందోళన ఉద్ధృతం చేస్తామన్నారు. సమావేశంలో కౌలు రైతులకు భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులిచ్చి అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తీర్మానం చేశామన్నారు. కౌలు రైతుల సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం చేస్తామన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు కేతా గోపాలన్, కవురు శ్రీనివాస్, ఇంజేటి శేఖర్, కేతా పూర్ణారావు, కర్రి నాగిరెడ్డి, మన్నె నగేష్, ఉందుర్తి శ్రీను, గుత్తుల వెంకటేశ్వరరావు, కేతా పాటియ్య పాల్గొన్నారు.

# ఘనంగా మావుళ్లమ్మ జాతర


అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు


ఆకట్టుకొన్న గరగ నృత్యాలు

**పెనుగొండ:** సిద్ధాంతం గ్రామ దేవత మావుళ్లమ్మ జాతర మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా బుధవారం ఉదయం నుంచి మావుళ్లమ్మ దర్శనానికి భక్తులు పోటెత్తారు. మంగళవారం రాత్రి మావుళ్లమ్మ ఫ్రెండ్స్ యూనియన్, మావుళ్లమ్మ ఆలయ పునఃనిర్మాణ కమిటీ, ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో జోరు వర్షంలోనూ జాతరను బుధవారం ఉదయం వరకూ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బుట్టబొమ్మల విన్యాసాలు ఆకట్టుకొన్నాయి. అమ్మవారి ఉగ్రరూప నృత్యం తిలకించడానికి పరిసర గ్రామాల నుంచి మహిళలు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. పుర వీధుల్లో గ్రామోత్సవం కనుల పండువగా నిర్వహించారు. బాణసంచా కాల్పులు, మంగళ వాయిద్యాలతో ఉత్సవం వేడుకగా నిర్వహించారు.

# మున్సిపల్ కార్మికుల ఆందోళన ఉద్ధృతం



నరసాపురం: పట్టణంలో నిరసన ర్యాలీ చేస్తున్న మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులు


నరసాపురంలో మున్సిపల్ కార్మికులకు మద్దతు తెలుపుతున్న పెండ్ర వీరన్న



పాలకొల్లు సెంట్రల్: అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

**నరసాపురం:** మున్సిపల్ ఇంజనీరింగ్ సెక్షన్‌లో కాంట్రాక్ట్ పద్ధతిపై పని చేస్తున్న ఉద్యోగులు, కార్మికులు తమ డిమాండ్ల సాధనకు చేపట్టిన ఆందోళనను ఉధృతం చేశారు. తమ సమస్యల పరిష్కారం కోరుతూ ఏపీ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ జేఏసీ పిలుపు మేరకు బుధవారం పట్టణంలో నిరసన ర్యాలీ చేపట్టారు. మున్సిపల్ కార్యాలయం వద్ద వద్ద నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకూ ర్యాలీ కొనసాగింది. ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలని వేడుకుంటూ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. కాంట్రాక్ట్ ఉద్యోగులు, కార్మికులను రెగ్యులైజ్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కనీస వేతనం అమలు చేయాలని, ఆరోగ్య బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి పి.రత్నం, వి.ఫణి, ఎం.సత్యనారాయణ, కె.కాశీ, సీహెచ్ వాసు, ఎ.ముదుబాబు, ఎం.సుజాత, కె.కళ్యాణి, ఎస్ దేవి నాయకత్వం వహించారు. వరుసగా మూడో రోజు మున్సిపల్ కార్యాలయం వద్ద రిలే దీక్షలు కొనసాగించారు.

**మున్సిపల్ కార్మికులకు అండగా వైఎస్సార్‌సీపీ**

మున్సిపాలిటీలో ఇంజనీరింగ్ సెక్షన్ లో కాంట్రాక్ట్ పద్ధతిపై పని చేస్తున్న ఉద్యోగులు, కార్మికులకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని ఎంటీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పెండ్ర వీరన్న అన్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గత మూడు రోజులుగా మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న కార్మికుల రిలే దీక్షా శిబిరాన్ని వీరన్న సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వీరన్న మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు చేసి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్ సెక్షన్‌లో పని చేస్తున్న కార్మికులను క్రమబద్ధీకరించాలని వారు డిమాండ్ చేశారు.

**అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం**

పాలకొల్లు సెంట్రల్: తమ న్యాయమైన కోర్కెలు వెంటనే పరిష్కరించాలంటూ మున్సిపల్ అవుట్ సోర్సింగ్ ఇంజనీరింగ్ కార్మికులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఏపీ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ జేఏసీ ఆధ్వర్యంలో మూడో రోజు నిరసన దీక్ష చేపట్టారు. ఉదయం 11 గంటల సమయంలో స్థానిక యడ్ల బజారు సెంటర్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్దకు ర్యాలీగా వెళ్లి వినతి పత్రం ఇచ్చి నిరసన వ్యక్తం చేశారు. పది సంవత్సరాలు పైబడిన వారిని రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, హెచ్ఆర్‌సీ అమలు చేయాలని, టెక్నికల్ వర్కర్లకు రూ.29,200, నాన్ టెక్నికల్ వర్కర్లకు రూ.24,500 ఇవ్వాలని, రిటైర్మెంట్ వయస్సు 60 నుంచి 62 ఏళ్లకు పెంచాలని ఇలా పది డిమాండ్లు నెరవేర్చాలన్నారు. తమ న్యాయమైన సమస్యలను త్వరగా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో రాజాభవానీ శంకర్ (శివ), మండెల శ్రీను, గోపి, జి.శేఖర్, కర్రా ప్రభాకర్, పి.నాగసూర్యప్రకాష్, కె.ఆంజనేయులు, కె.ధనరాజు, కె.వాసు, పాలూరి రవి, వేగి నరసింహులు, పి.కళారాణి, జె.భారతి పాల్గొన్నారు.

### ఐటీఐ రెండో విడత కౌన్సెలింగ్

**పెనుగొండ:** ఆచంటలోని ప్రభుత్వ ఐటీఐలో 2025–26 విద్యా సంవత్సరానికిగాను రెండో విడత కౌన్సెలింగ్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ యిందుకూరి వెంకట సత్యనారాయణ రాజు తెలిపారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ జులై 15వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకొని, 15వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు నకళ్లను కళాశాలలో అందించాలని వివరించారు. 21వ తేదీ ఉదయం 10 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఐటీఐ కళాశాలకు హాజరుకావాలని కోరారు. వివరాలకు సెల్ నంబర్ 9490111002ను సంప్రదించాలని తెలిపారు.

### ట్రిపుల్ ఐటీకి ఎంపిక

**పెనుమంట్ర:** మండలంలోని పొలమూరు గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థిని పిల్లి రత్నశ్రీ ఒంగోలు ట్రిపుల్ ఐటీకి అర్హత సాధించింది. పొలమూరు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని పదో తరగతిలో 568 మార్కులు సాధించి, ఒంగోలు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు స్థానిక సమతా ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు తాడిపర్తి సంపత్ రావు తెలిపారు.

### జూన్ 25 హక్కులు కోల్పోయిన రోజు

**పాలకొల్లు సెంట్రల్:** భారతదేశం చరిత్రలో జూన్ 25 అంటే దేశం హక్కులను కోల్పోయిన రోజని రాజ్యసభ సభ్యుడు పాకా సత్యనారాయణ అన్నారు. బుధవారం స్థానిక లజపతిరాయ్‌పేట మాంటిస్సోరి స్కూల్‌లో కాంగ్రెస్ విధించిన అత్యవసర పరిస్థితి చీకటి రోజుకు 50 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా జిల్లా స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ పాకా సత్యనారాయణ మాట్లాడుతూ కాంగ్రెస్ విధించిన అత్యవసర పరిస్థితి రోజు జూన్ 25 కావడంతో అప్పటి నుంచి ఈ రోజును బ్లాక్‌డేగా గుర్తించారన్నారు.